టీడీపీ యువగళం...వైసిపి అభివృద్ధి మంత్రం

భోగాపురం కేంద్రంగా రాజకీయాలు

విశాలాంధ్ర-విజయనగరం: తాజా రాజకీయ పరిణామాలతో జిల్లోని భోగాపురం మండలం అధికారపక్షం, విపక్షాలకు రాజకీయ వేదికగా మారింది. లోకేష్ యువగళం ముగింపు సభతో తమ సత్తాచాటాలని టిడిపి భావిస్తుంటే, అభివృద్ధి మంత్రంతో తామేంటో చెప్పాలని వైసీపీ ప్రయత్నిస్తోంది. లోకేష్ యువగళం ముగింపు సభ ఈ నెల 20న భోగాపురం మండలం పోలిపల్లి లో జరగనుంది. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సహా అతిరథమహారథులు పాల్గనే ముగింపు సభ భారీ స్థాయిలో నిర్వహించాలని టిడిపి పక్కాప్రణాళికతో ముందుకు సాగుతోంది. రాష్ట్ర వ్యాప్తం గా సుమారు 5 లక్షలమందిని సమీకరించేందుకు టీడీపీ సమా యత్తమవు తోంది. ఈ నేపథ్యంలో అధికార పక్షం భోగాపురం మండలంలో ఒక అడుగు ముందే వేసింది.ఉత్తరాంధ్ర నేతలంతా భోగాపురం మండలానికి తరలి వచ్చారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ పనుల పురోగతి పరిశీలించేందుకు శనివారం మంత్రులు, అమర్నాథ్, బూడి ముత్యాలనాయుడు, ధర్మన కృష్ణదాసు, ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, జెడ్పిచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితర ఉత్తరాంధ్రకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఎయిర్ నిర్మాణ ప్రాంతానికి వచ్చారు.ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ పనుల పరిశీలనకే పరిమితం కాకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ఉత్తరాంధ్ర లో జరుగుతున్న అభివృద్ధి పనులను నేతలు వివరించారు. .విజ యనగరం జిల్లాలో ఎయిర్‌పోర్ట్, వైద్య కళాశాల, పార్వతీ పురంలో ఇంజ నీరింగ్ కళాశాల, శ్రీకా కుళంలో మూల పాడు పోర్ట్, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పాడేరులో వైద్య కళాశాల, విశాఖ పరిపా లనా రాజధానిగా చేయ డం తాజాగా విశాఖ లో బెంగళూర్ ఇంటర్నేషనల్ స్కూల్ మంజూరు వంటీ కార్యక్రమాలు ఉత్తరాంధ్ర అభివృద్ధి పై జగన్మోహన్ రెడ్డికి ఉన్న చిత్తశుద్ధిని చెపుతాయని వైసీపీ నేతలు చెప్పారు. ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి కృషి చేసింది తామేనని వివరించారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు శంఖుస్థాపనలు చేయడం మినహా చేసిందేమీ లేదని విమర్శలూ ఎక్కుపెట్టారు. యువగళం ముగింపు సభలో నాయకులు ప్రభుత్వం పై పెద్ద ఎత్తున విమర్శలు చేసే పరిస్థితి ని ముందే ఊహించిన వైసిపి అంతకంటే ముందే తాము చేసిన అభివృద్ధి ని వివరించడం తో పాటు మీడియా ముఖంగా వాటిని ప్రజల్లోకి మరోసారి తీసుకువెళ్లే యత్నం చేసింది.మొత్తంమీద యువగళం ముగింపు సభ ప్రభావాన్ని తగ్గించే దిశగా అధికార పక్షం వ్యూహాత్మకంగా అడులు వేస్తోందని చెప్పొచ్చు.

వన విహారయాత్రలో పూర్వవిద్యార్థుల కలయిక

నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న 90-91 బ్యాచ్ విద్యార్థులు

విశాలాంధ్ర-జామి: వారంతా 1990-91కు చెందిన పదో తరగతి విద్యార్థులు.. ఈఏడాది ఎలాగైనా కలవాలని నిర్ణయించుకున్నారు. అందుకు విహార యాత్ర ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుని ఆదివారం జామి సమీపంలోని నానాజీగారి మామిడితోటలో విహార యాత్ర ఏర్పాటు చేసుకున్నారు. మండలంలోనే కాకుండాయ ఇతర జిల్లాలు, రాష్ట్రాలు దాటి మరీ పూర్వ విద్యార్థులు ఈవనవిహారానికి హాజరయ్యారు. ఉదయం 10గంటలకే విచ్చేసిన పూర్వ విద్యార్థులు అంతా కలిసి నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఎవరు ఎక్కడ ఉంటున్నారో. ఏం చేస్తున్నారో తెలుసుకుని పరిచయాలను చేసుకున్నారు. అనంతరం అంతా కలిసి వన భోజనాలు చేసారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసుకున్న వీరంతా భవిష్యత్ కార్యచరణకు సంభందించి పలు నిర్ణయాలను తీసుకున్నారు. తిరిగి మరోసారి కలిసేందుకు ఏర్పాట్లు చేయాలని పలువురు సూచించారు. ఈ పూర్వ విద్యార్థుల కలయికలో టీడీపీ విజయనగరం పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడు కొత్తలి సూర్యారావు, వైసీపీ సీనియర్ నేత, భీమసింగి జెసిఎస్ కన్వీనర్ మజ్జి హరికృష్ణ సైతం ఉండడం విశేషం.

తిరుమలకు 40వ రోజు పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నదే నా సంకల్పం:ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: సి.ఎం.జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని దృఢమైన సంకల్పముతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేస్తున్న జయహో జగనన్న పాదయాత్రలో భాగంగా 40వ రోజు ఆదివారం శ్రీబాలాజీ జిల్లా వెంకటగిరి పట్టణం నుండి సతీమణి సుధారాజు, కుమారుడు, ఎస్.కోటకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్సీ రఘురాజు తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్నారు.

హామీలు అమర్చిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డిదే...

పార్టీలు, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి మళ్లీ రెండోసారి ముఖ్యమంత్రి కావాలన్న సంకల్పంతో తిరుమలలోని శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనానికి అభిమానులు, నాయకులతో తరలి వెళ్తున్నామని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వ్యాఖ్యానించారు. వెంకటగిరి పట్టణం వద్ద ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఒక్కటే గమనించాలి.. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ఎన్ని ఒడిదుడుకులు వచ్చినప్పటికీ పట్టుదలతో సీఎం జగన్మోహన్ రెడ్డి నెరవేర్చారని తెలుసుకొని రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నకు పట్టం కట్టాలని సూచించారు. శ్రీవెంకటేశ్వర స్వామి అనుగ్రహంతో సీఎంగా జగన్మోహన్ రెడ్డి రెండోసారి ఎన్నికవడం ఖాయమని ఎమ్మెల్సీ రఘురాజు ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ సతీమణి సుధారాజు, ఎస్.కోట సర్పంచ్ జి.సంతోషికుమారి, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, అభిమానులు ఉన్నారు.

గ్రూప్-2 ప్రిలిమినరీ పరిక్షకై ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర-విజయనగరం : ఏ.పి.పి.ఎస్సీ నిర్వహించే గ్రూప్-2 ప్రిలిమినరీ పరిక్షకు సంబంధించి ఉచిత శిక్షణ కొరకు ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన అర్హులైన బి.సి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అబ్యార్థుల నుండి దరఖాస్తులు కోరడమైందని, ఆంధ్రప్రదేశ్ స్టడీసర్కిల్ ఫర్ బ్యాక్వర్డ్ క్లాసెస్ డైరెక్టర్ కె.నందీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-2 కోసం ఈనెల తే.23/12/2023.ది. లోగా దరఖాస్తు చేసుకోవాలని చూచించారు. ఈ నెల 27 వ తేది నుంచి 50 రోజులు పాటు 80 మంది అబ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇవ్వబడును. ఉచిత శిక్షణకు అభ్యర్థుల ఎంపిక డిగ్రీలో వచ్చిన మార్క్ ల మెరిట్ ప్రాతిపదికపై జరుగుతుందన్నారు. అర్హులైన అబ్యర్థులు తమ బయోడేటా తో పాటు పది, డిగ్రీ మార్క్ లిస్టులు, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, 2 పాస్ ఫోటో సైజు ఫోటోలు దరకాస్తుతో జతచేయాలని కోరారు. మిగతా వివరములు కొరకు 9603557333, 8330967871 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

మృతి చెందింది చిరుత కాదు అరుదైన పిల్లి

జిల్లా అటవీశాఖ రేంజరు అప్పలరాజు

విశాలాంధ్ర-రామభద్రపురం: తారాపురం నకు సమీపం లో ఆదివారం ఉదయం 26వ నెంబరు జాతీయ రహదారిపై అప్పలనా రాయణ ఇటుక బట్టి వద్దరోడ్డు దాటుతుం డగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక అరుదైన పిల్లి మృతిచెందిందని జిల్లా అటవీ శాఖ రేంజరు అప్పలరాజు తెలిపారు. ఈ జాతికి చెందిన పిల్లి ఇంతవరకు మేము కూడా ఎక్కడ చూడలేదని ఆయన తెలిపారు. దీనినీ ఫిసింగ్ క్యాట్ గా పిలుస్తారని తెలి పారు. దీని ఆకారం అచ్చం చిరుత పులి లాగే ఉంటుందని, కానీ మనుషులపై దాడి చేయదని తెలి పారు. ప్రజలు ఎవరు ఆందోళన చెంద వలసి న అవసరం లేదని ఈ ప్రాంతంలో ప్రస్తుతం పులి ఎక్కడ కూడా సంచరించం డంలేదని అన్నారు. అలాగే చిరుత అనుకొని చుట్టుపక్క ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో చూడ్డానికి వచ్చారు. కార్యక్రమంలో డిఆర్ఓ సుధీర్ సెక్షన్ ఆఫీసర్ కెవిఎస్ఎన్ రాజు, సమతా, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో పించన్‌దారుల పాత్ర కీలకం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సామాజిక సేవలో పించన్ దారుల పాత్ర కీలకమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అభిప్రాయపడ్డారు. ఆదివారం అఖిల భారత పింఛన్ దారుల సంఘం వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా వార్షికోత్స వానికి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ పదవీ విరమణ కేవలం ఉద్యోగానికే గాని సామాజిక సేవకు అడ్డు కాదని అన్నారు. పింఛన్ దారులు సమిష్టిగా కృషి చేసినట్లయితే ఎన్నో విజయాలు సాధించవచ్చని అన్నారు. ఉద్యోగాలలో అందించిన సేవలను భవిష్యత్తులో కూడా సమాజానికి వినియోగపడాలని ఆశించారు. పించన్ దారులు ఎంతో ధైర్యాన్ని కలిగి సమాజాభివృద్ధికి ముందుండి నడిపించాలని అన్నారు. వారి యొక్క సూచనలు సలహాలు సమాజానికి ఎంతో అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. పింఛన్ దారులకు ఏ అవసరం ఉన్న తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సంఘం తరపున ఏ కార్యక్రమాన్ని తలపెట్టిన ఆర్థికంగా, హార్దికంగా తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, పింఛన్ దారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

గంటవాని చెరువు నీరు ఎగదన్నటంతో నీటిలోనే వరి బడిపీలు

ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్న రైతులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట మండలం, కాపుసోం పురం వద్ద గల గంటవాని చెరువు మదుములు తీయకపోవడంతో నీరు ఎగదన్ని వరి పంట నీటమునిగి నష్టం వాటిల్లుతోందని రైతులు కర్రి వెంకటరావు, చిన్న, దొర తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గంటవాని మదుములు తీయకపోవడంతో ఇటీవల కురిసిన తుఫాను వర్షాలకు చెరువు బ్యాక్ వాటర్ పొలాల్లోనే ఉండిపోయిందని, దీంతో కోసిన వరిచేల బడిపిలు, పలుచోట్ల వరిచేలు కోయకుండా వదిలేసిన పరిస్థితి దాపురించిందని, దీంతో నీటిలో నానుతున్న బడిపిలు నుండి మొలకలు వస్తున్నాయని రైతు వెంకటరావు అన్నారు. ఇప్పటికైనా ఆయకట్టు రైతులకు ఎదురవుతున్న పరిస్థితిని పరిశీలించి వీలైనంత త్వరగా గంటవాని చెరువు మదుములు కొద్దిగా తెరచి నీరు కొద్దిగా కిందకు విడిచి పెట్టాలని కోరారు. కనీసం ఇరిగేషన్ అధికారులైనా సమస్యను పరిశీలించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

యువ గళం నవశకం సభకు తరలిరావాలి

విశాలాంధ్ర- గజపతినగరం: తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం నవ శకం బహిరంగ సభకు టిడిపి నాయకులు కార్యకర్తలు తరలిరావాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ పిలుపునిచ్చారు ఆదివారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో పిలుపునిచ్చారు ఆదివారం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెలిమర్ల నియోజకవర్గం లోని పోలిపల్లి గ్రామంలో ఈనెల 20వ తేదీన సాయంత్రం యువ గళం ముగింపు సభ జరుగుతుందన్నారు ఈ సభకు నియోజకవర్గంలోని కార్యకర్తలు నాయకులు పార్టీ అభిమానులు పాల్గొనవలసిందిగా కోరారు ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పాలన

ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్రంలో పాలన సాగుతుందని ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు అన్నారు. నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి అగురువీధిలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా మూడేళ్లలోనే 98 శాతం హామీలను నెరవేర్చినట్లు చెప్పారు. పారదర్శక పాలన వైసిపికే సాధ్యమన్నారు. ఎటువంటి అవినీతికి తావలేకుండా సంక్షేమ పథకాల డబ్బుని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమచేస్తున్నట్లు చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ బంగారు సరోజిని, నగరపంచాయతీ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కౌన్సిలర్లు చిక్కాల సంతోషి, మొయిద శ్రీనివాసరావు, జెసిఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, నాయకులు గంటా సతీష్, రేగాన శ్రీనివాసరావు, బూర సత్యనారాయణ, నౌపాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-గుర్ల: గ్రామాల అభివృద్ధికి వైయస్సార్సీపి ప్రభుత్వం కృషి చేస్తుందని. వైకాపా జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని పున్నపురెడ్డిపేట లో మండల పరిషత్ నిధులు నుండి రూ.2 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ఆయన ఆదివారం ప్రారంభించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు కోసం నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు అభివృద్ధి, సంక్షేమ ప్రభుత్వానికి రెండు కళ్ళు అని అన్నారు కార్యక్రమంలో స్థానిక వైకాపా నాయకులు రామకృష్ణ, అప్పలనాయుడు, రాము తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్ర ఏర్పాట్లు పరిశీలించిన అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-భోగాపురం: మండలంలో పోలిపల్లి గ్రామంలో టిడిపి యువనాయకులు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముగింపు సందర్భంగా యువగళం సభా వేదిక ఏర్పాట్లను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఈ సభతో తెలుగుదేశం పార్టీకి జరిగే మేలు కంటే 5 కోట్ల ఆంధ్రులకు జరిగే మేలే ఎక్కువ అని అన్నారు. సభకు విచ్చేసే అందరికీ సౌకర్యంగా ఉండేటట్లు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వర్యులు నిమ్మకాయల చినరాజప్ప, అల్లపాటి రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు,ఉత్తరాంధ్ర జోనల్ ఇంఛార్జి దామచర్ల సత్య ,నెల్లిమర్ల టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, ఇచ్ఛాపురం పరిశీలకులు సువ్వడ రవి శేఖర్,భోగాపురం మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం

తెలంగాణ ప్రభుత్వాన్ని చూసైనా ఆంధ్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల పట్ల సానుకూలత ప్రదర్శించాలి : పీఆర్టీయు

విశాలాంధ్ర-బెలగాం : తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల హామీని మొదటి అసెంబ్లీ సమావేశాలలోనే నిర్ణయం తీసుకోవడం ఆనందించవలసిన విషయమని, ఏ ప్రభుత్వ మైనా ఇచ్చిన మాట ను నిలబెట్టుకోవాలని పిఆర్టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఉపాధ్యాయ ఉద్యోగ కార్మిక పెన్షనర్లకు ఇచ్చిన ఏ హామీ ని నిలబెట్టుకోకపోవడం బాధాకరమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని చూసైనా రావలసిన పిఆర్సీ బకాయిలు, కరువు భత్యం బకాయిలు, సంపాద సెలవులు నగదుగా మార్చుకోవడం, ఎపి జిఎల్ఐ నిధులు విడుదల చేయడం, పిఎఫ్ నిధులు విడుదల చేయడం, ఇచ్చిన మాట ప్రకారం సిపిఎస్ విధానాన్ని రద్దు చేయడం, కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయడం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను మినిమం టైం స్కేల్ ఉద్యోగులుగా మార్చాలని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు పెన్షనర్లు అందరూ ప్రజలలో భాగమని ప్రభుత్వ పెద్దలు తెలుసుకోవాలని సూర్యనారాయణ కోరారు.

యువగళం సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి : ఇంచార్జి విజయ్‌చంద్ర

విశాలాంధ్ర-సీతానగరం: ఈనెల 20న పోలిపల్లి వద్ద జరుగనున్న యువగళం పాదయాత్ర ముగింపు సభకు మండలం నుండి టీడీపీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్వతీపురం టీడీపీ నియోజక వర్గ ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర పిలుపునిచ్చారు.ఆదివారం బలిజిపేట మండల టీడీపీ పార్టీ కార్యాలయంలో యువగళం ముగింపు సభగూర్చి, బాబుశ్యూరిటి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం గూర్చి సమావేశాన్ని నిర్వహించారు.మండల పార్టీ అధ్యక్షుడు పెంకి వేణునాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఇంచార్జి విజయ్ చంద్ర పాల్గొని మాట్లాడారు.ప్రతి గ్రామంలో బాబుశ్యూరిటి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంను త్వరిత గతిన పూర్తి చేయాలని కోరారు. నియోజక వర్గంలోని మూడు మండలాల పరిధిలోని ముమ్మరంగా జరుగుతున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు ముగింపు సభకు వెళ్ళడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పెంకి పార్వతి, టీడీపీ నియోజక వర్గ నేత గొట్టాపు వెంకటనాయుడు, గుల్ల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

మరికి పంచాయతీలో ఎమ్మెల్యే జోగారావు పర్యటన

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : మండలంలో గల మరికి గ్రామంలో అభివృద్ధి పనులు మరియు ప్రగతిపై స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పంచాయతీ పరిధిలోగల అన్ని గ్రామాల లో మంచినీటి రహదారుల సమస్యకు శాశ్విత పరిష్కారం చూపడం జరుగుతుందని తెలిపారు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వార ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన ప్రతి ఒక్క సమస్యకు పరిష్కరించడం జరుగుతుందని అన్నారు మరికి పంచాయతీ ప్రజల చిరకాల కోరిక మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారము చేసి చూపుతున్న ఏకైక ప్రభుత్వం మనదని అన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేగారి తో పాటు మండలపార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్ జడ్పిటిసి బలగ నాగేశ్వరరావు ఎంపీపీ మజ్జి శేఖర్ వైస్ ఎంపీపీ బంకురు రవికుమార్ స్థానిక సర్పంచ్ హిమరక రాజు ఎక్స్ సర్పంచ్ సోమశేఖర్, వివిధ గ్రామ సర్పంచ్లు గండి శంకర్రావు ప్రవీణ్ కుమార్ పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

డిజిపి డిస్క్ కమెండేషన్ అవార్డు అందుకున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

విశాలాంధ్ర-పార్వతీపురం: ప్రతిష్టాత్మక డిజిపి డిస్క్ కమెండేషన్ అవార్డుకు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఎంపికయ్యారు. దీంతో మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో రాష్ట్ర డిజిపి కె.వి రాజేంద్రనాథ్ రెడ్డి చేతులమీదుగా ఈఅవార్డును పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం అందుకున్నారు. కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్,దిశ, శాంతిభద్రతల విభాగంలో అత్యుత్తమ పనితీరు కనబరచిన ఐపిఎస్ అధికారులకు ప్రతీఏటా కమెండేషన్ అవార్డులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఆయనతో పాటు విజయనగరం జిల్లా ఎస్పీ దీపిక పాటిల్ కూడా అందుకున్నారు. వీరితో పాటు జిల్లాలోని ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ తిరుమలరెడ్డి కూడా డిజిపి చేతుల మీదుగా డీజీపీ సిల్వర్ డిస్క్ అవార్డు అందుకున్నారు.డిజిపి సిల్వర్ డిస్క్ మెడల్‌లను సాధించిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ను, విజయనగరం జిల్లా ఎస్పీ దీపిక పాటిల్‌ను, హెడ్ కానిస్టేబుల్ తిరుమలరెడ్డిని రెండు జిల్లాల పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు. వారు చేసిన సేవలు రెండు జిల్లాల పోలీస్ సిబ్బందికి ఆదర్శప్రాయమని అన్నారు.

యువగళం ముగింపు సభను విజయవంతం చేయాలి

కురుపాం నియోజకవర్గ పరిశీలకులు ఆరేటి మహేశ్

విశాలాంధ్ర-కురుపాం: యువగళం ముగింపు సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కురుపాం నియోజకవర్గ పరిశీలకులు ఆరేటి మహేశ్ కోరారు. ఆదివారం ఉదయం ఆయన మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మండల పార్టీ కన్వీనర్ అసెంబ్లీ ,రాష్ట్ర స్థాయిలో వివిధ హెూదాల్లో ఉన్నటువంటి నాయకులకు, క్లస్టర్ యూనిట్ మరియు బూత్ ఇంచార్జ్ లంతా ,డిశంబర్ 20వ తేదీన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ (యువగళం ముగింపు)సభ భోగాపురం మండలం, పోలిపల్లి నందు జరగనున్న సందర్భంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ సభను విజయవంతం చేయుటకు కురుపాం నియోజకవర్గం లోని తెలుగుదేశం పార్టీ నాయకులు అత్యధిక సంఖ్యలో జన సమీకరణ చేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, క్లస్టర్ ఇంచార్జ్ లు, యూనిట్ ఇంచార్జ్ లు మరియు బూత్ ఇంచార్జ్ లు మరింత సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రతి మండలంలోని మండల పార్టీ కన్వీనర్ తో సమన్వయం చేసుకొని నాయకులు , కార్యకర్తలు భారీగా వాహనాలలో బయలుదేరి తెలుగుదేశం పార్టీ భారీస్థాయిలో నిర్వహిస్తున్నటువంటి భారీ బహిరంగ సభను మన బాధ్యతగా పాల్గొని విజయవంతం చేయాలని ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆహ్వానం పలుకుతున్నాం.

యువగళం - నవశకంను విజయవంతం చేయాలి: ఇంచార్జి విజయ్ చంద్ర

పార్వతీపురం: ఈదశాబ్దాపు అతిపెద్ద రాజకీయవేదుక ,రాబోయే 2024 లో జరగ బోయే సార్వత్రికఎన్నికలకు సమర సంఖారావం పూరించబోయే యువగళం-నవశకం సభను విజయవంతం చేయడానికి అంతా కలిసికట్టుగా ఉండి ప్రణాళిక ప్రకారం కార్యాచరణను ఆచరించి విజయవంతం చేయాలని పార్వతీపురం టీడీపీ నియోజక వర్గ ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర తెలిపారు.దీనికోసం ప్రణాళిక రూపొందించడానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అధ్యక్షతన ఉమ్మడి విజయనగరంజిల్లాలో ఉన్న ఇంఛార్జిలతో సన్నాహక సమావేశంను ఆదివారం విజయనగరం అశోక్ బంగ్లాలో నిర్వహించారు.పార్వతీపురం నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయ చంద్ర మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజవంతంచేయటం కోసం కొన్ని సూచనలు చేశారు.ఈకార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రివర్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు,ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త దామచర్ల సత్య ,నియోజకవర్గ ఇన్చార్జిలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం

విశాలాంధ్ర-బెలగాం: పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం తాలూకా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో స్థానిక రైతు బజార్ సమీపంలో ఉన్న ఆ సంఘ భవనంలో ఆదివారం అఖిల భారత పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముందుగా అతిథులతో జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం గాంధీ విగ్రహానికి, కీర్తిశేషులు నగరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సమావేశం ప్రార్ధన గీతంతో ప్రారంభించి సంఘ ప్రధాన కార్యదర్శి దొడ్లంకి గణపతి రావు సంక్షిప్తంగా కార్యదర్శులు నివేదిక సమర్పించారు. అనంతరం 70 సంవత్సరాలు నిండిన 10 మంది పెన్షనర్లకు కార్యవర్గ సభ్యులచే శాలువలు కప్పి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ నగరాని స్తుతిస్తూ నివాళులర్పిస్తూ ప్రముఖ కవి, రచయిత గంట్యాడ గౌరి నాయుడు రచించిన గీతాన్ని తవిటిరాజు, గంటేడ సోమేశ్వరరావు, బోనెల ప్రకాష్ లు గీతాలాపన చేశారు. చివరిగా గంటేడ శ్రీనివాసరావు కార్యవర్గ సభ్యులచే వందన సమర్పణ అనంతరం జాతీయ గీతాలాపనతో సమావేశం ముగించారు. సమావేశంలో అధిక సంఖ్యలో పెన్షనర్ల పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనానికి ఎప్పటికీ మోక్షం కలుగునో?

శిథిలావస్థ భవనంలో ఇంకెన్నాళ్లీ పాట్లు...

విశాలాంధ్ర -సీతానగరం: మండల కేంద్రములోని రోగులకు మెరుగైనవైద్య సేవలు, చికిత్సలు అందించాల్సిన వైద్యులకు, వైద్యసిబ్బందికి సరైనభవనం లేక తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఇదిగో...అదిగో అంటున్నారు తప్ప కొత్త భవనం అందుబాటులోకి రాక ఉన్న భవనం మరమ్మత్తులకు గురికావడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది, రోగులు చెబుతున్నారు. రూ.166.99లక్షల రూపాయలతో నాడు-నేడు ద్వారా రహదారుల భవనాలు శాఖ అధ్వర్యంలో 2020 అక్టోబర్ 10న శంకుస్థాపన చేశారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేసి అప్పజెబుతామని చెప్పిన మాటలు ఒట్టి మాటలే అని రుజువు అయ్యాయి. భవనం పూర్తి చేయలేదు. నిధులులేక గుత్తేదారు సైతం మధ్యలో పనులు నిలిపివేసి వెళ్ళిపోయాడు.

మూడేళ్లు గడిచిన భవనం పూర్తికాక,ప్రస్తుతం ఆసుపత్రి ఉండే భవనం పూర్తిగా బీటలువారి, ఫ్లోరింగు పాడై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇదిగో అదిగో అని చెప్పడం తప్ప పనులు జరగకపోవడంతో ఆసుపత్రి సిబ్బంది ఎప్పటికప్పుడు చిన్న చిన్న మరమ్మత్తులను చేస్తూ కాలం గడుపుతున్నారు. ఇప్పటికైన ఆసుపత్రి భవనం నిర్మాణాలపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టిసారించి కొత్త భవనం అందుబాటులోకి తెచ్చే చర్యలు తీసుకోవాలని మండల ప్రజానీకం, రోగులు కోరుతున్నారు.

కంపు కొడుతున్న ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మరుగుదొడ్డి

విశాలాంధ్ర-రామభద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ప్రయాణికుల వద్ద నుంచి టికెట్ రూపంలో దపదపాలుగా ప్రయాణికులు వద్ద నుంచి భారీగా డబ్బులు పెంచి సొమ్ము చేసు కుంటుందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉండే మరుగుదొడ్ల పరిస్థితి చాలా అధ్వానంగా ఉంటున్నాయని ఆరోపిస్తున్నారు. మరుగు దొడ్డికి వెళ్లాలంటే నరకయాత్ర పడవలసి వస్తుందని ప్రయాణికులు అంటున్నారు. మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న మరుగుదొడ్డి పరిస్థితి చాలా దారుణంగా ఉందని అంటున్నారు. మరుగుదొడ్డి చాలా చెత్తగా ఉందని మరుగుదొడ్డి వినియోగిం చడానికి చాలామంది భయపడుతున్నారని అంటున్నారు. అలాగే మరుగుదొడ్డి నుండే వచ్చే దుర్వాసన కాంప్లెక్స్‌లో ఉండే ప్రయాణికులకు, పక్కన ఉన్న మార్కెట్ కు వచ్చే వారికి కూడా దుర్వాసన చాలాచెత్తగా వస్తుందని అంటున్నారు. దీని అంతటికి కారణం మరు గుదొడ్డి లీకై నీరు బయటకు రావడం వల్ల ఈ దుర్వాసనవస్తుందని పలువురు ప్రయాణి కులు ఆరోపిస్తున్నారు. తక్షణమే ఆర్టీసీ అధికారులు మరుగుదొడ్డి పై దృష్టి సారించి మరుగుదొడ్డును బాగు చేయాలని పలువురు ప్రయాణికులు ,స్థానికులు కోరుతున్నారు.

గ్రంధాలయానికి రిటైర్డ్ రైల్వే ఉద్యోగి స్వామినాయుడు దంపతులు పుస్తకాలు వితరణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట : శృంగవరపు కోట శాఖా గ్రంధాలయానికి రిటైర్డ్ రైల్వే ఉద్యోగి కర్ణాటక స్వామినాయుడు దంపతులు రూ.12 వేల విలువచేసే పోటీ పరీక్షలకు ఉపయోగపడే 30 పుస్తకాలను ఆదివారం బహుమతిగా అందించారు. స్వామినాయుడు దంపతులకు గ్రంథాలయ పాఠకులు, లైబ్రేరియన్ దామోదర శ్రీధర్ పత్రికా ముఖంగా కృతజ్ఞతలు తెలియజేశారు. స్వామినాయుడు మాట్లాడుతూ డిగ్రీ చదివే యువకులు, నిరుద్యోగ యువత పోటీ పరీక్షల పుస్తకాలను చదువుకుని ప్రయోజకులు కావాలని సూచించారు.

ఎస్.కోటలో 137వ రోజుకు చేరుకున్న అన్న క్యాంటీన్ నిత్య అన్నదానం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: పేదల ఆకలిని తీర్చడమే లక్ష్యంతో శృంగవరపుకోట మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట, పుణ్యగిరి రోడ్డులో మాజీ మంత్రి స్వర్గీయ కోళ్ల అప్పలనాయుడు జ్ఞాపకార్థం, కోళ్ల పైడితల్లమ్మ ఆశీస్సులతో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ నిర్విరామంగా శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ & మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆర్థిక సహకారంతో నిర్విరామంగా కొనసాగుతోంది. తెలుగుదేశం పాఽఎర్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆదివారం 137వ రోజు అన్న క్యాంటీన్ ద్వారా ఆదివారం మధ్యాహ్నం వచ్చిన 300 మంది పేదవారికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉచితంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అభ్యర్థి భీశెట్టి అరుణ, శృంగవరపుకోట మండల పార్టీ అధ్యక్షులు జీ.ఎస్.నాయుడు, రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి చక్కా కిరణ్ కుమార్, నియోజకవర్గ ఐటీడీపీ కార్యదర్శి అనకాపల్లి చెల్లయ్య, శృంగవరపుకోట మండల ఐటీడీపీ అధ్యక్షులు గనివాడ బంగారు నాయుడు, జనార్దన్, అప్పారావు, రొంగలి రమణ, మునగపాక అప్పారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ అశోక్ కోరారు. నెల్లిమర్ల కేంద్రంగా జరుగుతున్న ఎస్ఎఫ్ఐ 31 జిల్లా మహాసభలు ఆదివారం రెండోరోజు కొనసాగాయి. అశోక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం సాగిస్తుందని చెప్పారు. జిల్లాలో విద్యారంగ సమస్యల మీద ఎస్ఎఫ్ఐ చేస్తున్న పోరాటాలకు జిల్లా విద్యాశాఖ అధికారులు సైతం ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సంవత్సరకాలంలో చేసిన సైకిల్ యాత్రలు, నిరవధిక నిరాహార దీక్షలు విద్యారంగ సమస్యల పరిష్కారానికి మంచి కృషి చేశాయని తెలిపారు. ఈ ఉద్యమస్ఫూర్తిని జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకత్వం కొనసాగించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు పక్షాన ఆలోచించాలని, జిల్లాలో సంక్షేమ హాస్టల్లో కు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, 2014లో కేటాయించిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు తక్షణమే సమకూర్చాలని కోరారు. మెడికల్ కళాశాలలో సీట్ల సంఖ్య పెంచి ,డబ్బులతో సీట్లు కొనే ధోరణికి చరమగీతం పాడాలని , ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్కే కళాశాల ఆధ్వర్యంలో స్కాలర్షిప్ టెస్ట్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ ఆర్కే ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ అధినేత కోలా రామకృష్ణారావు తాను స్థాపించబోయే ఆర్ కే ఐ ఐ టి- జేఈఈ, ఎన్ఈఈటీ అకాడమీ కి సంబంధించిన ఆర్కే స్కాలర్షిప్ కం అడ్మిషన్ టెస్ట్ ను ఆదివారం జిల్లావ్యాప్తంగా పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు 6 కేంద్రాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా అధినేత కోల రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఐ ఐ టి- జేఈఈ, ఎన్ ఈ ఈ టి జీవితాశయంగా భావిస్తున్నారని అందుకు అనుగుణంగా ఆర్కే కళాశాల ఆధ్వర్యంలో ఈ పరీక్షలను నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1350 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 40 శాతం ఫీజీ రాయితీ ఉంటుందన్నారు. ఇప్పటికే ఆర్కే కళాశాల జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ,డిగ్రీ ఫలితాలలో ఉత్తమ ప్రదర్శన ఇస్తుందన్నారు.

బానాదిలో వేడుకగా శ్రీ గౌరీ పరమేశ్వర్ల అనుపోత్సవం

- అలరించిన సాంస్కృతిక నృత్యప్రదర్శనలు
-పోటెత్తిన వైసీపీ నాయక గణం

విశాలాంధ్ర-వేపాడ: మండ లం లోని బానాది గ్రామంలో శని వారం రాత్రి జరిగిన శ్రీగౌరీ పరమేశ్వర్ల వారి అనుపు మహోత్సవం వేడుకగా జరిగింది. గ్రామ సర్పంచ్ కర్రి యశోద సారథ్యంలో గ్రామ పెద్దలు గొర్లె శంకర్, గల్లా రామచంద్రుడు, రాము మాస్టర్, కోటారావు, నక్క రాము నాయుడు, దుడ్డు తాతారావు, గ్రామయువతీ యువకుల పర్యవేక్షణలోగౌరమ్మ సంబరం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డాన్స్ బేబీ డాన్స్, రేలారె రేలా, మహిళల కోలాట నృత్యాలు అందరినీ విశేషంగా అలరించాయి. వీటిని తిలకించేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి యువకులు, చుట్టాలు, బంధువులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిదులుగా ఎస్ కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరాము నాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్ అప్పారావు, పంచాయతీరాజ్ జోనల్ ఇంఛార్జి మెరపల సత్యనారాయణ మండల పార్టీ అధ్యక్షుడు ముమ్ములూరి జగ్గిబాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, వావిలపాడు గ్రామ పెద్దలు గోగాడ చిన్నబ్బి నాయుడు, గండి శ్రీరామ్మూర్తి, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, సర్పంచులు మురిపిండి గంగరాజు, గొంప వేమన రాము, వడ్ల మాని శర్మ, బీల రాజేశ్వరి, కోలా సతీష్, ఎంపీటీసీ ఆకుల సత్యనా రాయణ, వైసీపీ నాయకులు జనపరెడ్డి హరి బాబు, బల్లంకి కనకరాజు, బొడ్డు శ్రీను, కండిపల్లి పెదనాయుడు, దండుపాటి సత్తిబాబు, చామంతుల గంగాధర్, దుల్ల అప్పన్న, ముచ్చకర్ల శ్రీను, నాగిరెడ్డి చిరంజీవి, సేనాపతి ఈశ్వరరావు, నక్క వెంకటరమణ , సీర తాతబాబు, కొట్నీ కృష్ణ, బోకం అప్పారావు, దుడ్డు నాయుడు, కర్రి తాతారావు తదితరులు పాల్గొని గౌరమ్మ సంబరాన్ని తిలకించారు. కాగా డీసీసీబీ చైర్మన్ వేచలపు చిన రామునాయుడు ప్రదర్శించిన నృత్యం అందరినీ ఉర్రూతూగించింది.

సమస్యల కొలువులో ఆశ్రమ విద్యార్థినులు...



విశాలాంధ్ర-కురుపాం : కనీస మౌలిక వసతులు లేక సమస్యలు తో సహజీవనం చేస్తున్నారు ఉదయపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు... మండలం లోని ఉదయపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఇటీవల నాడు.. నేడు పనులు పూర్తి చేసినప్పటికీ పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పన జరుగలేదు. ఫలితంగా ప్రతీరోజూ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా త్రాగునీటి కోసం నిర్మించిన ప్లాట్ ఫాంలో ట్యాప్ లు ఏర్పాటు చేయకుండా వదిలేయటం ,పూర్తి స్థాయిలో వసతికి సరిపడే రూం లు లేకపోవడంతో ఇరుకైన గదుల్లో సర్దుబాటు చేసుకుని నిద్రిస్తున్న దుస్థితి. 240మంది పిల్లలు కు అవసరమైన సౌకర్యవంతమైన మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రహరీ గోడలు నిర్మించి వాటికి ముందు గేట్లు ఏర్పాటు చేయక పోవడంతో కనీస రక్షణ లేకుండా పోయింది. గత్యంతరం లేక పాఠశాల కు వెదు కర్రలతో గేటు ఏర్పాటు చేసుకున్నామని డిప్యూటీ వార్డెన్ గౌరీశ్వరి ఆవేదన వ్యక్తంచేశారు.

మా పాఠశాల సమస్యల వలయం: డిప్యూటీ వార్డెన్ గౌరీశ్వరి

మండలం లోని ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే ,మండల విద్యాశాఖాధికారి , ఐటిడిఎ పిఓ, డిడి ఎంతమంది కి ఉదయపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల సమస్యలు విన్న వించినా సమస్యలు పరిష్కారం జరుగలేదని గత్యంతరం లేక రాత్రింబవళ్లు ఆడపిల్లల కు కాపలాగా ఉంటున్నామని డిప్యూటీ వార్డెన్ గౌరీశ్వరి అన్నారు.

ఆడపిల్లల పాఠశాల కు గేట్లను ఏర్పాటు చేయకుండా వదిలేయటం చాలా ఇబ్బందులు పడుతున్నాట్లుతెలిపారు.రహదారి కి ఓవైపు డార్మిటరీ ,మరోవైపు అరకొరగా పాఠశాల గదులు మరింత అవస్థలు కు కారణంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం తమ పాఠశాల సమస్యలు వలయంలో ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. అంతా చూసి వెళ్లిన వారేతప్ప పరిష్కారం శూన్యం అన్నారు.

మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక శ్రద్ధ చూపాలి : హెచ్ఎం నీలకంఠం

పాఠశాలలో అద్వాన్నంగా ఉన్న మౌలిక వసతులు మెరుగు పరిచేందుకు ఐటిడిఎ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.నీలకంఠం కోరారు. దీర్ఘకాలిక సమస్యలు పాఠశాల ను వేదిస్తున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. గతంలో నాడు.. నేడు జరిగిన ప్రయోజనం అంతంతమాత్రంగానే ఉందని అన్నారు.

సీఎం జగన్ కు తప్పుడు ప్రచారం తగదు

విశాలాంధ్ర-గజపతినగరం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిగ్గులేకుండా ప్రభుత్వ పథకాలను తన పథకాలుగా చెప్పుకుంటున్నారని ఓబీసీ రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్ విమర్శించారు ఆదివారం గజపతినగరం లోని బిజెపి కార్యాలయంలో ఓబిసి ఆత్మీయ సమ్మేళనం జిల్లా ఉపాధ్యక్షులు దేవరేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది సామాజిక పాలన మాటలకే పరిమితం అయిందన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఓబీసీ మోర్చా విజయం జిల్లా అధ్యక్షులు దంతినాడ అప్పలాచారి అయ్యంగారి కామేష్ కుసుమంచి సుబ్బారావు ప్రగడ కళ్యాణి తాడి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలోని గవర వీధిలో ఏర్పాటు చేసిన శ్రీగౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మహిళల చిరతలు, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. గౌరీ పరమేశ్వరులను మహిళలు దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించారు. అనుపు మహోత్సవంలో పెద్దఎత్తున గవరకుల పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం 12గంటలకు సీఎం లాంచింగ్ : ఎంపీడీఓ పట్నాయక్

విశాలాంధ్ర -వేపాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోమవారం మధ్యాహ్నం 12గంటలకు మెగా ఆరోగ్యశ్రీ అవేర్ నెస్ ప్రోగ్రాం వర్చ్యువల్ గా లాంచింగ్ చేస్తారని ఎంపిడిఓ పట్నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామ సచివాల యంలు, ఆర్బికేల వద్ద లైవ్ యూ ట్యూబ్ స్ట్రీమింగ్ ద్వారా లైవ్ ఏర్పాటు చేస్తారని ఎంపిడిఓ తెలిపారు. ఈ విషయాన్ని మండల ప్రజలందరూ గుర్తిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ పట్నాయక్ కోరారు.

దిశా పై అవగాహన

విశాలాంధ్ర- కురుపాం: పార్వతీపురం మన్యం జిల్లా దిశా డి.ఎస్.పి ఆదేశాలు మేరకు ఆదివారం కురుపాం స్థానిక ఎపి మోడల్ స్కూల్లో దిశ చట్టం పై అవగాహన, దిశ అప్ పై అవగాహన, సమాజంలో మహిళల పై జరిగే నేరాల పై అవగాహన మరియు అత్యవసర పరిస్థితుల్లో స్వీయ రక్షణ ఎలా చేసుకోవాలి అనే అంశాలపై విద్యార్థినులకి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దిశ పోలీస్ స్టేషన్ ఎస్సై లావణ్య, కానిస్టేబుల్ క్రాంతి కుమార్, కురుపాం పోలీస్ స్టేషన్ సిబ్బంది లక్ష్మి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నూర్పుల్లో రైతులు

ధాన్యం తడిసినా తగ్గని దిగుబడులు
సకాలంలో వర్షాలు పడక దెబ్బతిన్న మెట్టవరి

విశాలాంధ్ర-వేపాడ: తుఫాన్ భయంతో రైతులు వరి పంట నష్టాలను తగ్గించు కునేం దుకు వీలుగా ముమ్మరంగా రైతులు వరి నూర్పుల్లో తలమునకలై ఉన్నారు. పది రోజులు క్రితం పడిన తుఫాన్ వర్షాలకు వరి పంట తడిసిన నేపథ్యంలో మరలా వర్షాలు పడితే పంట తడిసి ఎందుకు పనికిరాకుండా పోయే పరిస్తితి ఉన్నందున రైతుల్లో భయాం దోళనలు నెలకొన్నాయి. దాంతో మండల రైతాంగం అప్రమత్తమై ట్రాక్టర్ల సాయంతో ముమ్మరంగా నూర్పులు పడుతున్నారు. కాగా ధాన్యం వర్షాలకు త డిసినప్ప టికి దిగుబడులు మాత్రం తగ్గలేదని రైతులు అంటున్నారు. అయితే ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉన్నా ప్రభుత్వం మంచి మనసుతో ధరలు తగ్గించకుండా ప్రకటించిన ధరలోనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మండల రైతాంగం కోరుతోంది. అయితే ఈ ఏడాది వరుణుడు సరిగా కరునించక మెట్ట పంట దెబ్బతినడం , పెట్టిన పెట్టుబడులు కూడా సరిగా రాకపోవడం వల్ల కలిగే నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేయాలని రైతులు కోరారు.

గీతా జయంతి సందర్భంగా బాలబాలికులకు శ్లోక కంఠస్థ పఠణ పోటీలు

గొట్లాం గాయత్రీ పాఠశాల విద్యార్థికి మొదటి బహుమతి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా బాలబాలికులకు శ్లోక కంఠస్థపఠణ పోటీలు స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించారు.ఇందులో భాగంగా జూనియర్ విభాగంలో కంది జ్ఞానాక్షిత్ ఏడవ తరగతి గొట్లాం గాయత్రి పాఠశాల విద్యార్థికి మొదటి బహుమతి, జి ప్రణవసాయి ఏడవ తరగతి రామన్ పాఠశాల ఎస్ కోట రెండవ బహుమతి, కేం మౌనిక ఆరవ తరగతి రామన్ పాఠశాల ఎస్ కోట మూడో బహుమతి సంపాదించారు. సీనియర్ విభాగంలో పి ఎస్ ఎస్ విని రామన్ పాఠశాల ఎనిమిదవ తరగతి మొదటి బహుమతి కే వైష్ణవి, 8వ తరగతి శ్రీ చైతన్య రెండవ బహుమతి ఎం రామ హర్షిత, 8వ తరగతి రామన్ పాఠశాల ఎస్ కోట మూడవ బహుమతులు కైవసం చేసుకున్నారు ఇందులో న్యాయ నిర్ణయతలుగా ఎన్ శ్రీనివాసరాజు, బిపి రవికుమార్, శ్రీనివాసచార్యులు పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అధికారి శ్యామసుందరం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జామి మీదుగా ఆర్‌టిసి బస్సులు వేయాలి

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామి మీదుగా ఎస్.కోటనుంచి విజయనగరం వెళ్లే బస్సులు తగినన్ని లేక అటు విద్యార్థులు, ఇటు ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నాలుగు బస్సులు ఈరూట్‌లో నడిచేవి. కానీ కాలక్రమేణా అద్దె బస్సులను సైతం తొలగించారు. ఇప్పుడు కేవలం ఒక అద్దె బస్సు, ఒక ఆర్‌టిసి సొంత బస్సు మాత్రమే తిరుగుతున్నాయి. వీటిని నమ్ముకుని ప్రయాణాలు చేయలేమని ప్రయాణీకులు వాపోతున్నారు. ఈరూట్‌లో బస్సుల ఆవశ్యకత వున్నా ఎందుకు బస్సులను తొలగించారో ప్రజలకు అర్థంకాని ప్రశ్నగా మిగిలిపోయింది. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు ప్రయాణీకుల అవసరాన్ని గుర్తించి అదనంగా బస్సులు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

19, 20, 21 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు విజయవంతం చేయాలి

డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయా యాదవ్

విశాలాంధ్ర -విజయనగరం టౌన్ : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మ దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 19, 20, 21 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయా యాదవ్,ఏ ఎం సి చైర్మన్ శశి భార్గవి కోరారు. ఇందుకు సంబంధించిన టీషర్టు లను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నా మన్నారు. స్థానిక మహిళా పార్కులో పోటీలు చేపడుతున్నామన్నారు. మొదటి బహుమతిగా 50వేల, రెండవ బహుమతిగా 40 వేలు, మూడో బహుమతిగా 30 వేలు,నాలుగో బహుమతిగా 20 వేల రూపాయలు చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను అందించనున్నామని తెలిపారు. రాష్ట్ర మహిళా కబడ్డీ జట్టులు ఇప్పటికే తమ వివరాలను నమోదు చేసుకున్నారని తెలిపారు.రాష్ట్రస్థాయిలో కేవలం మహిళా క్రీడాకారులు కబడ్డీ పోటీలలో పాల్గొనడం ప్రాధాన్యతను సంతరించుకుందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ లంక వరలక్ష్మి,పొట్నూరు పద్మ, కార్పొరేటర్లు తాళ్లపూడి సంతోషి కుమారి దుప్పాడ సునీత, రేగాన రూపా దేవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు లిడ్ ఇండియా ఫౌండేషన్ సిఎంఎల్‌డిపి శిక్షణ కార్యక్రమం



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : లిడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులును ఎంపిక చేసి వారిలో దేశం పట్ల, సమాజం పట్ల, విద్యపరంగా స్ఫూర్తిని నింపే కార్యక్రమం అయిన సి.ఎం.ఎల్.డి.పి. (క్రిటికాల్ మాస్ డెవలప్మెంట్ ప్రోగ్రాం) రెండో దశలో గుర్తించిన 440 మంది విద్యార్థులును ఛేంజ్ ఏజెంట్స్‌గా మార్చేందుకు పాఠశాలలు హెడ్ మాస్టర్స్, టీచర్స్, వలంట్రీలు కి శిక్షణ కార్యక్రమన్నీ సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి 4 గంటలు వరకు స్థానిక జిల్లా పరిషత్ హాల్లో ఇవ్వబడును అని, ఈ కార్యక్రమంకి ముఖ్య అతిధిలుగా లిడ్ ఇండియా ఫౌండర్ డాక్టర్ ఎన్. బి. సుదర్శన్ ఆచార్య, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఏం. వెంకటేశ్వరావు పాల్గొని శిక్షణ ఇస్తారు అని తెలిపారు.

పెనుభారంగా మారిన మైనింగ్ రాయల్టీ...

గగ్గోలు పెడుతున్న పేద ప్రజలు
కుంటి నడకన సాగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలు
పట్టించుకోని పాలకులు

విశాలాంధ్ర - వేపాడ : ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల పేద ప్రజలు విలవిల లాడు తున్నారు. ప్రభుత్వం జారీ చేసే జీఓలు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయకుండా రెండు జిల్లాలకు మాత్రమే పరిమితం చేయడం పాలకులకు సమంజసం కానే కాదు. నిత్యావసరాల మీద విద్యుత్ బిల్లులు పైన, పెట్రోల్, గ్యాస్ పైన ఇప్పటికే ధరలు పెంచిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇళ్ల నిర్మాణాలకు ఉపయోగించే ఇసుక, పిక్క పైన కూడా ఏదో రూపంలో ధరలు పెంచి పేదప్రజల నడ్డి విరుస్తుండడంతో అనేకరకాలుగా మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు. కళ్ళ ముందునే ఉన్న ఇసుకను కొనలేక అవస్థలు పడుతున్న పేద ప్రజలపై ప్రభుత్వం ఇటీవల మైనింగ్ రాయల్టీ పేరుతో మరో దోపిడీకి పాల్పడడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వం తమ ఆదాయాన్ని పెంచుకోవడానికి ఇటీవల మైనింగ్ రాయల్టీ వసూలుకు జీఓ జారీ చేసింది. నిజానికి ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రాప్తికి రాష్ట్రమంతా దానిని వర్తింపజేయాలి. అలా చేయకుండా కేవలం విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు మాత్రమే వర్తింప జేయడంతో క్వారీ, క్రషర్లలోని పిక్క కొనుగోలుకు ఇక్కడ బ్రేక్ పడింది. ఉదాహరణకు గతంలో ట్రాక్టర్ యూనిట్ పిక్క రూ. 2400లుగా ఉంటే రాయల్టీ వసూలు వల్ల అదనంగా రూ.1250 లు చెల్లించాల్సి రావడంతో పేద ప్రజలకు అది పెనుభారంగా మారింది. అలాగే రాయల్టీ వసూలుకు సంబంధించి కాంట్రాక్టర్ పలు చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ముక్కుపిండి రాయల్టీ వసూలు చేస్తుండడంతో కొద్దిగా దూరాభారమైన పొరుగున ఉన్న విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో గల క్రషర్లకు కొనుగోలు దారులు పరుగులు పెడుతుండడంతో క్రషర్ల లోని పిక్క ఎక్కడిది అక్కడే నిల్వ ఉండిపోతోంది. అలాగే అదనపు భారం మోయలేక జగనన్న కాలనీ లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. దాంతో ఇళ్ల నిర్మాణాలు కుంటినడకతో సాగుతున్నాయి. ఒక పక్క అధికారులు ఆంక్షలు విదిస్తూ ఇళ్ల నిర్మాణాల జోరు పెంచకుంటే పట్టాలు రద్దు చేస్తామని బెదిరిస్తుండడంతో కొంతమంది లబ్ధిదారులు చేసేది లేక ఇళ్లను నిర్మించే స్తోమత లేక గుట్టుగా అమ్మకాలు సాగిస్తున్నట్టు పుకార్లు షికారు చేస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి మైనింగ్ రాయల్టీ వసూలును నిలిపివేసి ప్రజల నెత్తిన భారం పడకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే ఇసుక ధరలు కూడా తగ్గించాలని ఇళ్ల లబ్ధిదారులు కోరుతున్నారు. మండలంలో ని వావిలపాడు, సోంపురం ప్రాంతాలలో దాదాపుగా పదికి పైగా క్రషర్లు ఉన్నప్పటికీ బ్రిటిష్ పాలకుల మాదిరిగా ప్రభుత్వం మండల ప్రజల హక్కులను హరిస్తూ రాయల్టీ పేరుతో పెనుభారం మోపడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

సత్య కళాశాల లో ధీర ఫౌండేషన్‌లో శిక్షణ ముగించిన విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక తోటపాలెం లో గల సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు నిర్వహించిన కుట్టు పని పై శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికేట్స్ ను ధీర ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ బొత్స సందీప్, సతీమణి పూజిత, మాజీ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి చేతులు మీదుగా 60 మందికి పంపిణీ చెయ్యటం జరిగింది. ఆదివారం బొత్స సందీప్ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం. బొత్స సందీప్ పుట్టిన రోజు ను కూడా కేక్ కట్ చేసి ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ ధీర ఫౌండేషన్ గత మూడు సంవత్సరాలు గా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతో మందికి సహాయ సహకారాలు అందిస్తున్నదని అందులో భాగంగానే ఈ కుట్టు పనిని నేర్పించి వారికి స్వయం ఉపాధికి తోడ్పడిందని పేర్కొన్నారు.సందీప్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు చేస్తూ తమ వంతు సహకారం అందించడానికి ధీర ఫౌండేషన్ ముందు వుంటుందని పేర్కొన్నారు.పూజిత మాట్లాడుతూ మహిళలకు ఎక్కువ కష్టం లేకుండా జీవించేందుకు కావలసిన అవకాశాలను భవిష్యత్తులో కల్పించడానికి ధీర ఫౌండేషన్ కృషి చేస్తుందని తెలియ జేశారు.సత్య కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు మాట్లాడుతూ ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు పని పై శిక్షణ పొందిన అభ్యర్థులకు సూచనలు ఇచ్చి దీనిని ఇంకా ప్రాక్టీస్ చేసి ఇంకా నైపుణ్యం సంపాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చక్రధర్ , పిరమిడ్ ధ్యాన ప్రక్రియ ను ఫాలో అవుతున్న పత్రీజీ శిష్యులు ప్రకాష్, రామ కృష్ణ,. చిట్టి బాబు, రుక్మిణీ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, కళాశాల ఎన్ సి సి ఆఫీసర్ కెప్టెన్ ఎం సత్య వేణి, కళాశాల ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ . బీ. సూరపు నాయుడు, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడులు : అదుపులో 14 మంది

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : మండలంలో గల చిన బొండపల్లి గ్రామ పరిసర ప్రాంతంలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు 14 మంది సభ్యులను అదుపులో తీసుకొని వారి దగ్గర రూ. 1,11,150 / రూపాయలు స్వాధీనం చేసుకున్నారు మరియు అడ్డాపుశిల గ్రామంవెలుపల 11 మంది సభ్యులను అరెస్టు చేసి వారి దగ్గర రూ17,243 / రూపాయలు స్వాధీనం చేసుకున్నారు అడ్డాపుశిల గ్రామం బయట. 4 సభ్యులను అరెస్టు చేసి వారి దగ్గర రూ 4050 స్వాధీనం చేసుకున్నారు వీరిపై కేసులు నమోదు చేశామని పార్వతీపురం రూరల్ ఎస్సై తెలిపారు.

పాత్రికేయులు బాధ్యతాయుత పాత్రను పోషించాలి : ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర - సీతానగరం/బెలగాం : ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే పత్రిక విలేకరులు బాధ్యతాయుతంగా ఉండి కీలకమైన పాత్రను పోషించాలని పార్వతీపురం ఎమ్మెల్యే అలజింగి. జోగారావు కోరారు.ఆదివారంనాడు సీతానగరం మండలంలోని జోగమ్మపేటలో సాహితీ రిసార్టు ఆవరణలో జిల్లాస్థాయి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఏర్పాటుచేసిన వనభోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆయనను ప్రింటు అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు బొకేలు అందజేసి దుస్సాలువకప్పి సత్కరించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ తాను విద్యార్థిదశ నుండే శాసనసభ్యులుగా అవ్వాలనే కోరిక ఉండేదని, దానికోసం 22ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే అయ్యాక అన్నివర్గాల ప్రజలలో సుస్థిర స్థానాన్ని దక్కించుకోవడానికి తాను నిరంతరం కష్టపడి పనిచేయడం తన ప్రధాన కర్తవ్యమని తెలిపారు. నియోజక వర్గంలోని రాజకీయాలకు,కులాలకు, మతాలకు అతీతంగా పనిచేయడం, అందరికీ అందుబాటులో ఎల్లపుడూ అందుబాటులో ఉండటానికి తాను ఎల్లప్పుడూ ఆలోచన చేస్తూ ఉంటానని చెప్పారు. నియోజక వర్గంలోని ప్రజలతో పాటు పత్రికా విలేకరులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వడంలో తాను రాష్ట్రంలో ముందంజలో ఉన్నట్లు తెలిపారు. రానున్న సాధారణ ఎన్నికలలో కూడా తాను నిరంతరం కష్టపడి పనిచేస్తున్న విధానాన్ని చూసి సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. పత్రిక విలేకరులను తన కుటుంబ సభ్యులతో సమానంగా చూస్తానని, ఎవరికీ కష్టంవచ్చిన తాను మీకు మద్దతుగా ఉంటానని చెప్పారు. తన పరంగా, ప్రభుత్వపరంగా విలేకరుల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. నియోజక వర్గంలోని పెద్ద ఎత్తున ఇళ్ళ స్థలాలు అందజేసిన సందర్భంగా ఎమ్మెల్యే జోగారావుకు పత్రిక విలేకరులు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. తాము సహకారాన్ని అందిస్తామని తెలిపారు. ఆయనతో పాటు పార్వతీపురం పురపాలక సంఘం పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబి సీజ్డ్ వెహికిల్‌లో సిబ్బంది షికార్లు

విశాలాంధ్ర - కురుపాం : మండలం లో గల మూలుగూడ జంక్షన్ సమీపంలో గురువారం ఎస్ఈబి సిబ్బంది మాటు కాశి కారులో 20 క్యాన్లతో తరలిస్తున్న 200 లీటర్ల నాటు సారా మరియు కారును స్వాధీన పరుచుకొని సీజ్ చేశారు . అంతవరకు బాగానే ఉన్నప్పటికీ అదే కారుతో ఎస్ఈబి సిబ్బంది వారు వ్యక్తిగత పనులకు వాడుతూ షికార్లు చేస్తు తిరుగుతున్న సంఘటన శనివారం ఉదయం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఈబీ నిబంధనలు ప్రకారం సీజ్ చేసిన వాహనాలు ఆక్షన్ వేసేవరకు వాటిని వాడకూడదు.అలాగే సంబంధించిన వాహనం ను జాగ్రత్తగా ఉంచాలి. కానీ మండలంలో ఉన్న ఎస్ఈబి సిబ్బంది అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. కార్లు, ఆటోలే కాకుండా ద్విచక్ర వాహనాలు అయితే వారు ఇస్టారాజ్యంగా వాడుతూ అవి వేలం వేసే సమయానికి వాహనంలో సరైనటువంటి పార్టులు లేక సారా తో పట్టుబడ్డ వాహనాలు అంటే కేవలం స్క్రాప్ బల్లు గానే మిగులుతున్నాయని ఆక్షన్ కి వెళ్లే ప్రజలు దీనిపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.. సీజ్ చేయబడిన వాహనంతో ఏదైనా ప్రమాదం జరిగి ప్రజలకు జరగరాని సంఘటన జరిగితే దానికి ఎస్ఈ బిసిబ్బంది లేక సీజైన కారు యజమాని ఎవరు బాధ్యులనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఎస్ ఈ బీ ఉన్నత అధికారులు స్పందించి వ్యక్తి గత అవసరాలకు వాహనాలును సిబ్బంది ఇష్టరాజ్యంగా అ సీజ్ చేసిన వాహనాలను వాడకుండా ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు. అలాగే పట్టుబడిన కండీషన్ లో ఉన్న ద్విచక్రవాహనాలను ఇటీవల వినియోగించినట్లు పలువురు చెప్పకనే చెపుతున్నారు.

తెలుగు మహాసభలకు తరలి వెళ్ళండి : నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : తెలుగు భాష, తెలుగు సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పేందుకు ఆంధ్రసారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్తఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించడం మన తెలుగువారందరికి గర్వకారణమని విజయగరం కార్పరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఈసందర్భంగా మహాసభల గోడ పత్రికను ఆమె ఆవిష్కరించారు. ఈ సభల్లో విజయనగరం నుంచి కూడా కవులు, కళాకారులు, సుమారు 25మంది పాల్గొంటున్నారని..మన జిల్లానుంచి ప్రతినిధ్యం వహించే కవులు మన భాషాసంస్కృతులను దేశదేశాల వారికి చాటిచెప్పడం గర్వకారణమన్నారు. పరస్పర సహకారంతో మన సాహితీ వేత్తలు పాల్గొని జిల్లా పేరుప్రఖ్యాతలు చాటగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ గజల్ శ్రీనివాస్ అధ్యక్షులుగా ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో తెలుగు భాషలో 25 సాహితీ ప్రక్రియలపై మూడు రోజులపాటు సదస్సులు నిర్వహించబడుతున్నాయని, రాజరాజ నరేంద్రని పట్టాభిషేక సహస్రాబ్ది నీరాజనంగా నిర్వహించు ఈ కార్యక్రమంలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వివిధ సాహితీ ప్రక్రియలోని ప్రముఖ సాహితీ వేత్తలందరూ పాల్గొంటున్నారు. వివిధ రాష్ట్రాల గవర్నర్లు, సినీ ప్రముఖులు కూడా పాల్గొంటున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా భోగరాజు సూర్య లక్ష్మి వ్యవహరిస్తున్నారు. ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో సాహితీవేత్తలు అవధాని కట్టమూరి చంద్రశేఖర్, హిమబిందు, అరసం కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, ఎం.విజయభాస్కర్, జిల్లా సంచాలకులు రేపల్లె ఈశ్వర్, కొంకేపూడి అనురాధ, చిన్నాదేవి, సాలూరి సంతోషి, దాసరి పద్మ, ఈపు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రాతిబుగ్గి, మట్టిపై రాయల్టీ తొలగించాల్సిందే..

రాయల్టీకి వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసన

విశాలాంధ్ర - శృంగవరపుకోట : గ్రామ పరిధిలోని క్వారీలు, క్రషర్ల నుంచి పేద, మధ్యతరగతి ప్రజలు క్వారీల యాజమాన్యం ఉచితంగా ఇచ్చే రాతి, బుగ్గి మట్టిను తెచ్చు కునేందుకు రాయల్టీ వసూళ్లను వ్యతిరేకిస్తూ 3వ రోజు కూడా వెంకటరమణపేట వైసీపీ సర్పంచ్ శివకోటి, టీడీపీ మండల కార్యదర్శి జుత్తాడ రామసత్యం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. క్వారీలను ఆనుకుని ఉన్న చుట్టు పక్కల గ్రామాల ప్రజలు మాట్లాడుతూ తమ సమీపంలో ఉన్న క్వారీల నుండి ఇళ్ల పునాదులులకు పనికి వచ్చే మట్టి, బుగ్గి తెచ్చి వేసుకుంటున్నామని, అయితే వీటికి కుడా ఇటీవల కాలంలో తాము ప్రభుత్వం నుంచి కాంట్రాక్ట్ పొందామని కొందరు వ్యక్తులు తాము తెచ్చుకుంటున్న మట్టిని అడ్డుకోని రూ.1000 చొప్పున రాయల్టీ పేరుతో వసూళ్ల చేస్తున్నారన్నారు. పేద, మధ్యతరగతి వారిమి ఇళ్ల కట్టుకోవడమే కష్టమైన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. అయితే ఇప్పుడు క్వారీల వారు ఉచితంగా ఇచ్చే వాటిని తాము తెచ్చుకుంటున్నా రాయల్టి పేరుతో డబ్బులు వసూళ్ల చేయడం సరికాదన్నారు. దూర ప్రాంతాలకు ఎలా వసూళ్ల చేసుకున్నా అభ్యంతరం లేదని, తమ గ్రామంలో ఉన్న క్వారీల నుంచి తాము తెచ్చుకుంటే వసూళ్ల సరికాదని యువకులు, గ్రామపెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం

విశాలాంధ్ర - సీతానగరం : ఆదివారం ఉదయం ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. జనవరి 14వరకు ఉంటాయని సీతానగరంలోని శ్రీవేణుగోపాల స్వామి అర్చకులు లచ్చయ్యపేటలోని శ్రీవేంటేశ్వర స్వామి అర్చకులు తెలిపారు. నెలరోజులపాటు జరిగే ఉత్సవాలలో గోవింద నామస్మరణ జరుగుతుందని, గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, నిత్య సేవలు నిర్వహిస్తామని తెలిపారు. నగర సంకీర్తన జరుగుతుందని తెలిపారు. నేడు నెలగంటు పెట్టడం జరిగిందని తెలిపారు. భక్తులు గోవింద మాలలువేసి నెలరోజులపాటు దీక్షను చేపట్టారు. ఇదిలాఉండగా లచ్చయ్యపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీగోదాదేవి అమ్మవారి పంచామృత అభిషేకం ,శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీవేంకటేశ్వర స్వామి వారికీ పంచాభృత అభిషేకం మరియు శ్రీస్వామివారి కళ్యాణం జరిగిందని అర్చకులు తెలిపారు. ఈనెల 23న శ్రీవైకుంఠ ద్వార దర్శనం ఈరెండు ఆలయాల్లో ఘనంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ రోజూ భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని అర్చకులు తెలిపారు.

శృంగవరపుకోట : ఎస్.కోటలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన పూజారిని దేవి ఆధ్వర్యంలో ఉదయం నాలుగు గంటల సమయంలో నెలగంట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఆలయ అర్చకులు మనోజ్ శర్మ, దళితుల ఆధ్వర్యంలో వేణుగోపాల స్వామికి గోదాదేవికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ పూజలో పాల్గొన్న వందలాది మంది భక్తులు గోదాదేవి పూజలలో భాగంగా పసుపు దంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రోలులో పసుపు వేసి రోకలితో పసుపు దంచారు. అనంతరం ఆలయంలో ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జిల్లా వార్షిక ప్రణాళిక విడుదల

విశాలాంధ్ర - గజపతినగరం : గజపతినగరంలోని సత్యసాయి గీతా మందిరం ఆవరణలో జిల్లా వార్షిక ప్రణాళికను ఆదివారం సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ లక్ష్మణరావు ఆవిష్కరించారు 2024లో ఇప్పుడు ఏ కార్యక్రమం చేపట్టాలో పుస్తకంలో పొందుపరిచారు జిల్లా అధ్యక్షులు వివిఎస్ఎస్ సునీల్ కుమార్ రాథో రాష్ట్ర గ్రామ సేవా ఇన్చార్జ్ మెట్ల సత్యనారాయణ రాష్ట్ర యూత్ కోఆర్డినేటర్ వి.కళ్యాణ్ కన్వీనర్ వెంకటేష్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్ కోట పుణ్యగిరి రోడ్డులో ఉన్న శ్రీ సూర్య దేవాలయంలో ఆలయ ధర్మకర్త ముక్కు జానకీ బాయ్ పర్యవేక్షణలో ధనుష్ సంక్రమాణం పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు శంకరరావు, సూరిబాబు శర్మలు స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో జలాభిషేకం నిర్వహించారు. ఈ పూజలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

కళింగ వైశ్య ఆత్మీయ కలయిక వన సమారాధన

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : మండలంలో గల వెంకంపేట చినకొండపల్లి మధ్యలో గల చర్చి పక్కని మామిడి తోటలో కళింగ వైశ్య సంఘం వనభోజన కార్యక్రమం జరిగింది పార్వతీపురం మున్సిపాలిటీ బెలగాం కొత్తవలస వైశ్య సంఘాలు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ అన్న సమారాధన కార్యక్రమం తో పాటు ఆధ్యాత్మిక ఆటపాటలతో ఎంతో ఆహ్లాదకరంగా జరుగుతుందని అన్నారు సంఘ నాయకులు మాట్లాడుతూ మా కళింగ వైశ్యులలో పేదవారు ఉన్నారని రాజకీయ పార్టీ నాయకులు మమ్మల్ని గుర్తించి ఆదుకోవాలని అందరితోపాటు మాకు అన్ని విధాల సముచిత స్థానం కల్పించాలని కోరారు.

గజపతినగరంలో కైవల్య రథం ప్రారంభం

విశాలాంధ్ర - గజపతినగరం : గజపతినగరం సత్యసాయి సేవా సమితి వారు ఏర్పాటు చేసిన కైవల్య రథం ఆదివారం ప్రారంభించారు సత్యసాయి సేవ సమితి అధ్యక్షులు ఆర్ లక్ష్మణరావు రిబ్బన్ కట్ చేయగా ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక జండా ఊపి ప్రారంభించారు జిల్లా అధ్యక్షులు వివిఎస్ఎస్ సునీల్ కుమార్ రాథో రాష్ట్ర గ్రామ సేవా ఇంచార్జ్ మెట్ల సత్యనారాయణ కన్వీనర్ వెంకటేష్ అరిసెట్టి శంకర్రావు బెల్లాన త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

మన్యం జిల్లా సమగ్రాభివృద్ధికై ఐక్యంగా పోరాడాలి : వక్తలు

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా సమగ్రాభివృద్ధి సాధన కమిటీగా అన్ని వర్గాల ప్రజలు పార్టీ లు ఐక్యంగా కలిసి రావాలని సదస్సులో వక్తలు పిలుపునిచ్చారు. జిల్లాలో వ్యవసాయం, నీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, విద్యా, వైద్యం, రోడ్లు, వంతెనలు నిర్మాణ నిధులకై జనవరి 10వ తేదీన జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. గంగునాయుడు అధ్యక్షతన స్థానిక బెలగాం చర్చి కూడలి దరి చర్చి కమ్యూనిటీ హాల్లో జిల్లా సదస్సును నిర్వహించారు. తొలుత వక్తలను సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ ఆహ్వానించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు, సిపిఎం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం. కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లా ఒకవైపు ఎత్తైన కొండలు దట్టమైన అటవీ ప్రాంతం, ఓవైపు అక్షర జ్ఞానం లేని గ్రామాలు, మరోవైపు అభ్యుదయ భావాలతో దోపిడీని ఎదిరించే గ్రామాలు కూడా ఈ జిల్లా ప్రత్యేకతలని, జంఝావతి, తోటపల్లి వంటి జలాశయాలతో పాటు నాగావళి, సువర్ణముఖి వంటి జీవనదులు జిల్లా సొంతమని, కళలు, సాహిత్యం తదితర రంగాలకు పార్వతీపురం పెట్టింది పేరని అపారమైన వనరులున్న జిల్లా ఏళ్ల తరబడి పాలకుల నిర్లక్ష్యానికి గురై వెనుకబడిన ప్రాంతంగా మిగిలి ఉందన్నారు. పరిపాలించేవారు జిల్లా అభివృద్ధికి ప్రజలకు కావలసిన వాటి కోసం ఆలోచించే పరిస్థితి లేదని, ఇదే జిల్లా వెనుకబాటుకు కారణమని దీనిని అధిగమించాలంటే ప్రజలు చైతన్యంతో పోరాడటమే మార్గమని అన్నారు. జిల్లా మొత్తం భూమి 3,93,514 హెక్టార్లు ఉండగా సాగుకు అనువైన భూమి 1,67, 961 హెక్టార్లు సాగుకు పనికొచ్చే భూమి 42% అని జిల్లాలో రైతులు, గిరిజనులు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారని, వ్యవసాయ రంగం అభివృద్ధి కావాలంటే నీటి వనరులు అభివృద్ధి చేయడం చాలా అవసరం అన్నారు. 1978లో ప్రారంభించిన జంఝావతి ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదని, దశాబ్దాలు నాటి అడారుగెడ్డ, జంపర్ కోట మినీ ప్రాజెక్టులు సహితం పూర్తి చేయలేదని, జిల్లాలో వర్షపాతం ఎక్కువ నిల్వ చేసుకునే ప్రాజెక్టులు లేనందున వర్షపు నీరు ఉపయోగం లేకుండా సముద్రంలోకి పోతుందన్నారు. మినీ రిజర్వాయర్లు నిర్మించడం వలన గిరిజనుల భూమికి కొంతమేరకు నీరు ఇవ్వవచ్చునని, వీటి ఖర్చు చాలా స్వల్పం పాలకులు నిధులు కేటాయించనందు వలన వెనుకబడిన ప్రాంతంగా మిగిలిందని, దీనివలన కొన్ని ప్రాంతాలు కరువుకు గురవుతున్నాయన్నారు. ఉన్న లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీ, సాలూరు జ్యూట్ ఫ్యాక్టరీ మూతపడ్డాయని, ఫ్యాక్టరీలను తెరిపించకుండా రియల్ ఎస్టేట్ గా మార్చి వ్యాపారాలు చేసి జిల్లానే పరిశ్రమలు లేకుండా చేశారని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో ఉత్పత్తులైన జీడి, చింతపండు తదితర పంటలతో మినీ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించవచ్చునని అన్నారు. కొత్తగా మన్యం జిల్లా ఏర్పడిన నేపథ్యంలో జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కృషి అవసరమని, పాలకులు ఎవరైనా గిరిజనులు, దళితులు, బిసిల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ పెట్టలేదని వెనుకబడే ఉన్నారన్నారు. జిల్లాలో ఒక్క ఇంజనీరింగ్ కాలేజీ కూడా లేదని పేద జనం ఇతర ప్రాంతాలకు వెళ్లి పై చదువులు చదవలేని పరిస్థితి ఉందని, ఇది పాలకుల నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. జిల్లాలో ఆరోగ్యవసతులు, ఆస్పత్రులు ప్రజల అవసరాలకు సరిపోవటం లేదని, పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో స్పెషలైజేషన్ డాక్టర్లు లేరు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తి కాలేదు పేదలకు వైద్యం అందని ద్రాక్షగా ఉందని, డబ్బు ఖర్చు చేసి ఎక్కడికో వెళ్లి వైద్యం చేయించుకునే పరిస్థితి లేక మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి రావాలంటే పార్వతీపురంలో వెంటనే మెడికల్ కాలేజీ నిర్మాణం చేయాలని, మౌలిక వసతులు రోడ్లు, వంతెనలు అనేక గిరిజన గ్రామాలకు లేవని, పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడం ఈ జిల్లా పాలకుల నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధి కావాలంటే అన్ని వర్గాలు అన్ని రాజకీయ పార్టీలు జిల్లా సమగ్ర అభివృద్ధికి సాధన కమిటీగా కలిసి పోరాడాలని కోరారు. తోటపల్లి నివారణ పోరాట స్ఫూర్తితో జిల్లా సమగ్ర అభివృద్ధికై పోరాడాలని విజ్ఞప్తి చేశారు. ప్రముఖ న్యాయవాది టి. జోగారావు మాట్లాడుతూ జిల్లా వెనుకబాటుకు కారణమైన వ్యవసాయం నిర్లక్ష్యానికి గురైందని నీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి సెంటుకి నీరు అందించాలని తాగునీటి సమస్య పరిష్కరించాలని, విద్య వైద్య అభివృద్ధికి అన్ని వర్గాలు కలిసి రావాలని జిల్లాలో న్యాయవ్యవస్థ అభివృద్ధి కూడా సాధన కమిటీ ద్వారా కృషి చేయాలని సమగ్ర అభివృద్ధిపై జరిగే ఉద్యమంలో భాగస్వాముల అవుతామని తెలిపారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధి సాధనకై కలిసి రావాలని, 2024 జనవరి 10వ తేదీన చలో కలెక్టరేట్ నిరసన ర్యాలీని చేపట్టాలని జిల్లా అభివృద్ధి సాధనకు ప్రధాన డిమాండ్ల తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. జంఝావతి ప్రాజెక్టు వెంటనే పూర్తి చేయాలని, గిరిజన ప్రాంతంలో చిన్న చిన్న గెడ్డలు, వాగులు, నదులపై మినీ రిజర్వాయర్లు నిర్మించాలని, లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీ, సాలూరు జ్యూట్ ఫ్యాక్టరీని తెరిపించాలని, గిరిజన ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించాలన్నారు. పార్వతీపురంలో యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ నిర్మించాలని, గిరిజన గ్రామాల్లో రోడ్లు, వంతెనలు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలన్నారు. జిల్లా అభివృద్ధి కోసం చర్చించి సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ రూపొందించారు. అందరూ కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండంగి రమణ, కె. రామస్వామి అన్ని ప్రజా సంఘాల నాయకులు టి. రమేష్, భాస్కర్, కోలక అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వై నాయుడు, కొల్లి సాంబమూర్తి, రెడ్డి శ్రీదేవి, వి. ఇందిర, కోరాడ ఈశ్వరరావు, మర్రి శ్రీనివాసరావు, రెడ్డి లక్ష్మునాయుడు, దావాల రమణ, జగన్, నాయకులు కె. సీతారాం, భాను, బలరాం, రెడ్డి ఈశ్వరరావు, ప్రభాకర్, 15 మండలాల నుండి ప్రతినిధులు మండల, పట్టణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇది మట్టి రోడ్డు కాదు - తారు రోడ్డే!

పట్టించుకోని రవాణాశాఖ అధికారులు, పాలకులు

అవస్థలు పడుతున్న 4 గ్రామాల గిరిజన ప్రజలు

విశాలాంధ్ర - వేపాడ : నిజానికి మట్టిరోడ్డులా కనిపిస్తున్నా గతంలో అది తారు రోడ్డే. తారు రోడ్డు వేసిన అనతికాలంలోనే భారీ వాహనాల రాకపోకల వల్ల తారు రోడ్డు కాస్త మట్టి రోడ్డుగా మారిపోయింది. ఆ రోడ్డు గిరిజన గ్రామాలకు వేసిన రోడ్డు కాబట్టి గత టీడీపీ పాలకులు గాని నేటి వైసీపీ పాలకులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈరోడ్డు దుస్థితిని చూస్తే పాలకులకు గిరిజనులపై ఎంత చిత్త శుద్ధి ఉందో ఎవరికైనా ఇట్టే అర్థం కాకమానదు. ఇంతకీ ఆరోడ్డు ఏగిరిజన గ్రామాలకు వెళ్తుందో తెలుసుకోవాలంటే వివరాల్లోకి వెళదాం మండలంలోని వీలుపర్తి పంచాయతీలోని శివారు గ్రామాలైన కొలుకుపాలెం, పెదదుంగాడ, చిన్నదుంగాడ గ్రామాలతో పాటు వావిలపాడు శివారు కడకొండ గ్రామ గిరిజనులంతా మండల కేంద్రం వేపాడకు రావాలంటే ఇదే ప్రధాన రహదారి. వీలుపర్తి పంచాయతీలో గల రాతి క్వారీలు, క్రషర్లకు కూడా ఇదే ప్రధానమైన రోడ్డు. కానీ రోడ్డు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తక్కువ బరువుగల వాహనాలు మాత్రమే తిరగాలి. పరిమితికి మించి అధిక బరువులతో లారీలు తిరగడంతో ఈ రోడ్డు శిధిలావస్థకు చేరుకుంది. విజయనగరం,అనకాపల్లి జిల్లాల సరిహద్దుల్లో ఉన్న వేపాడ మండలం జిల్లాకే చివర మండలం మండలానికి చివర గ్రామాలుగా ఈ గిరిజన గ్రామాలు నిలుస్తాయి. మారుమూల ప్రాంతం కావడంతో రవాణా శాఖ అధికారులు పర్యవేక్షణ లోపించడంతో రాతి క్వారీల, క్రసర్ల నుండి రవాణా చేస్తున్న వాహనాలు యజమానులకు అడ్డు అదుపు లేకుండా పోతుంది.వాహనాల యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరించినా వారిని అడిగేనాథుడు లేక భారీ వాహనాలు తిరగడం వల్ల తారు రోడ్డు వేసిన అనతికాలంలోనే పూర్తిగా శిదిలమై మట్టిగా రోడ్డుగా మారిపోయింది. రోడ్డంతా రాళ్లు రప్పలు తేలిపోయి నిలువెత్తు గోతులుగా మారడంతో గిరిజనులు రాకపోకలు సాగించేందుకు నిత్యం నరకం చూస్తున్నారు. కనీసం మరమ్మతులకు గురైన మేరకు తారు రోడ్డు వేయాలన్న తలంపు పాలకులకు లేకపోవడం విచారకరం. కాగా వైసిపి అధికారం వచ్చి నాలుగున్నర ఏళ్ళు పూర్తి చేసుకున్నప్పటికీ ప్రధాన రహదారులకి దిక్కు లేకపోగా ఇంకా ఇలాంటి మారుమూల ప్రాంతాల్లో రోడ్లు పట్టించుకుంటారా అని ఆయా గిరిజన గ్రామాల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ అధికారులు స్పందించి వీలుపర్తి -చినదుంగాడ రోడ్డులో అధిక బరువులతో రవాణా చేస్తున్న వాహనాలను నిలువరించాలని, అలాగే పాలకులు పట్టించుకోని నూతన రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు చేసి పట్టించుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.



యువగళం యాత్ర ముగింపు పనులు పరిశీలన

విశాలాంధ్ర - కూర్మన్న పాలెం : టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర ముగింపు కి వచ్చింది. అగనంపూడి టోల్ గేట్ సమీపంలో ఉన్న పైలాన్ వద్దకు చేరుకోవటం తో యువగళం పాదయాత్ర ముగయనున్నది. దీనిలో భాగంగా పాదయాత్ర తో భారీగా రానున్న ప్రజలు, కార్యకర్తలు కి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఉదయం వడ్లపూడి జాతీయ రహదారి కి ఆనుకొని ఉన్న కాళీ స్థలాన్ని టీడీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావు, రాష్ట్ర కార్యదర్శి స్థానిక కార్పొరేటర్ బోండా జగన్నాధం పరిశీలించారు. పాదయాత్రలా భాగంగా నారా లోకేష్ సోమవారం మధ్యాహ్నం పెట్రోల్ బంక్ పక్క స్థలంలో బస చేయనున్నారు. కావున కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేశారు. కాళీ స్థలాన్ని చదును చేసి మీ సేవ ఉద్యోగులతో ముఖాముఖి మోటార్ వెహికల్ మెకానికులతో ముఖాముఖి ఏర్పాట్లు పార్కింగ్ సదుపాయాలు మరియు బస కి పూర్తి ఏర్పాట్లు చేసే దిశగా పరిశీలించారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశం తోనే పలు కాళీ స్థలాలు పరిశీలించి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లొ వి. రమణ,టీడీపీ 87 వార్డు అధ్యక్షులు రాజన్ రాజు, వర్రే రాంబాబు, సూరిబాబు, మూర్తి, కృష్ణ, మాటూరి రాము, రాజేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో పర్యాటకుల సందడి

విశాలాంధ్ర-సీతంపేట: మన్యంలో ఆదివారం పర్యాటకులు ప్రకృతి సోయ గాలను ఆస్వాదిస్తూ సందడి చేశారు. ఎన్టీఆర్ పార్క్, మెట్టుగూడ జలపాతం, సున్నపుగెడ్డ జలపాతం, ఆడలి వ్యూ పాయింట్, జగతి పల్లి వ్యూ పాయింట్ వంటి టూరిజం ప్రదేశాలను సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం కావడంతో అనేక ప్రాంతాల నుండి పర్యాటకులు అనేక ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు మన్యం ప్రాంతంలోకి వచ్చి పిక్నిక్ చేస్తూ సందడి చేశారు. ఎన్టీఆర్ పార్కులో బోట్ షికార్, జైసైక్లింగ్, చిన్నపిల్లల ఆట పాటలతో సందడి చేశారు. పర్యాటకులకు రానున్న రోజుల్లో మరిన్ని టూరిజం ప్రదేశాలను సిద్ధం చేయడం జరుగుతుందని పార్క్ ఇంచార్జ్ ఎస్ రాజు తెలిపారు.